ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

శుక్రవారం 22 మార్చి 2024



రంజాన్ వేళలు | శుక్రవారం(ఇఫ్తార్-6:35)। శనివారం (సహెర్-4:58)

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 21: కుటుంబ కలహాలతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గగ్గలపల్లిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్‌కు చెందిన చెన్నమ్మకు గోపాల్‌పేట మండలంలోని ఏదుల గ్రామానికి చెందిన బాలయ్యతో వివాహమైంది. సొంత గ్రామంలో జీవనోపాధి లేక నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గల పల్లి గ్రామంలో కూలీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబ కలహాలతో గురువారం పురుగులమందు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి రొయ్యల విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపా రు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

కోడ్ ముగిశాకే.. గృహజ్యోతి

- ఉమ్మడి జిల్లాలో మొత్తం కనెక్షన్లు 8,61,279
- అర్హత సాధించినవి 4,55,653
- ప్రతీనెల విద్యుత్ శాఖపై రూ.10 కోట్ల భారం





అర్హులందరికీ అమలు

ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటం సమస్యగానే ఉంది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత విద్యుత్ సంస్థలోని ఉన్నతాధికారులతో మాట్లాడి ఏ విధంగా అమలు చేయాలనే దానిపై ప్రణాళిక రూపొందించి అర్హులందరికీ అమలు చేయిస్తాం.

- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే

పాలమూరు, మార్చి 21: ఉమ్మడి జిల్లాలో గృహజ్యోతి పథకం అమలయ్యే పరిస్థితి కనిపించడంలేదు. రాష్ట్రమంతటా గృహజ్యోతి అమలు కావడం కేవలం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రమే అమలు కాకపోవటంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందిగా ఫీలవుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 27వ తేదీన సచివాలయంలో గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లా ప్రజలు కూడా తమకు గృహజ్యోతి పథకం అమలవుతుందని ఆశించారు. అధికార యంత్రాంగం అదేవిధంగా ఏర్పాట్లు చేసింది. కానీ ఫిబ్రవరి 26వ తేదీన ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి రావడం, వెనువెంటనే ఎంపీ ఎన్నికల కోడ్‌కూడా అమల్లోకి రావడంతో గృహజ్యోతి పథకం తాత్కాలికంగా నిలిచిపోయింది. కోడ్ ముగిసిన తరువాతనే జిల్లా ప్రజలకు గృహజ్యోతి పథకం అమలు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ పథకం అమలు చేస్తే విద్యుత్ సంస్థపై సుమారు రూ.10కోట్ల వరకు భారం పడనుందని అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు విద్యుత్ వినియోగ దారుల నుంచి బిల్లు బలవంతంగా వసూలు చేయాలని ఆదేశాలు లేవు. బిల్లు కట్టకపోయినా ఆ కనెక్షన్ కట్ చేస్తారని భయపడాల్సిన అవసరంలేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో వినియోగ దారుల సంఖ్య 2,39,402 ఉంది. అందులో 200 యూనిట్లలోపు వాడుకునే కనెక్షన్లు 1,41,375 ఉన్నాయి. అందులో 98,007 కుటుంబాలకు అర్హత ఉన్నట్లు విద్యుత్ సిబ్బంది గుర్తించారు. వారి నుంచి ప్రతీ నెలా సుమారు రూ.55,32,100 వసూలు చేస్తున్నారు. వనపర్తి జిల్లాలో మొత్తం - 2,06,710, అందులో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునేది 1,22,799 కనెక్షన్లు, అందులో 62,961 మంది గృహజ్యోతికి అర్హత సాధించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో - 1,96,915 కనెక్షన్లు ఉన్నాయి. 1,65,215 కనెక్షన్లు గృహ వినియోగదారులవిగా గుర్తించారు. 200 యూనిట్ల లోపు కనెక్షన్ల సంఖ్య 1,62,354 ఉన్నాయి. గృహజ్యోతికి అర్హత సాధించినవి - 76,433కనెక్షన్లు ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో - 1,00,000 కనెక్షన్లు, జోగుళాంబ గద్వాల జిల్లాలో - 1,18,252 కనెక్షన్లు ఉన్నాయి.

గృహజ్యోతి విధి విధానాలు

గృహజ్యోతి పథకంలో అర్హత సాధించాలంటే ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల కోసం తప్పనిసరి దరఖాస్తు చేసుకొని ఉండాలి. తెల్లరేషన్ కార్డుకు ఆధార్ లింకు చేయియించుకోవాలి. విద్యుత్ వినియోగం నెలకు 200యూనిట్లు మించినా, బిల్లులు పెండింగ్‌లో ఉన్నా పథకం వర్తించదు. 2022-23లో సగటున నెలకు 200యూనిట్లకు మించి విద్యుత్ వాడితే అనర్హులు. గతేడాదిలో నెలకు సగటున వాడిన విద్యుత్‌కు అదనంగ 10శాతం ఉచితం. పరిమితికి లోబడి వాడకం ఉంటేనే జీరో బిల్లులు. గృహజ్యోతికి అర్హత పొందనివారు ఆధార్, రేషన్‌కార్డులు అప్‌డేట్ చేసుకోవటం, కొత్తది తెచ్చుకునేందుకు ఎంపీడీవో, మునిసిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

నేరాల సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలి

- తెలంగాణ, కర్ణాటక పోలీసుల సమీక్షలో ఎస్పీ నిఖిల్



శక్తినగర్‌లో పోలీస్‌ల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ

నారాయణపేట, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల పోలీస్ అధికారులతో ఇంటర్ స్టేట్ బోర్డర్ కోఆర్డినేషన్ నేర సమీక్ష సమావేశం గురువారం కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూరు జిల్లా శక్తినగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాయిచూరు ఎస్పీ నిఖిల్ మాట్లాడుతూ సరిహద్దులో జరిగే నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి నగదు, బంగారం, మద్యం అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. నకిలీ ఓటర్లకు చెక్ పెట్టాలని సూచించారు. సమావేశంలో నారాయణపేట డీఎస్పీ లింగయ్య, కృష్ణ ఎస్ఐ నవీద్, జోగుళాంబ గద్వాల, మంత్రాలయం, కర్ణాటక పోలీసులు పాల్గొన్నారు..

భగ్గుమన్న బంగారం ధరలు

- తులం ధర రూ.68,500, కిలో వెండి రూ.78,500



నారాయణపేట, మార్చి 21: బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్నాయి. ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ధర పెరిగింది. గరిష్ఠంగా గురువారం బంగారం తులం (పది గ్రాములు) ధర రూ.68,500లకు చేరుకోగా, కిలో వెండి రూ.78,500 చేరుకున్నది.. ఒక రోజు క్రితం తులం బంగారం ధర రూ.67,500 పలకగా కిలో వెండి రూ.77,500 పలికింది. ఒక్క రోజు వ్యవధిలోనే రూ. 1000 పెరగడంతో కొనుగోలుదారులకు ఆర్థిక భారంగా మారింది. ఈ మధ్య కాలంలో పరుగులు తీస్తున్న పసిడి, వెండి ధరలు కలవరం కల్గిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో ఇలా పెరగడంతో కొనడం కష్టంగా మారుతుందని సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా తులం బంగారం ధర 68,500 చేరుకుందని, రాబోయే రోజుల్లో 70 వేలకు చేరుకునే అవకాశం లేకపోలేదని వ్యాపారులు అంటున్నారు.

రూ.70 వేలకు చేరే అవకాశం



చైనాలో బ్యాంకు వడ్డీ ధరలు తగ్గాయి. అమెరికాలో కూడా బ్యాంకు వడ్డీ ధరలు తగ్గించే అవకాశం ఉందని అంటున్నారు. వడ్డీ ధరలు తగ్గడం వల్ల అంతర్జాతీయంగా బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. తులం బంగారం రూ.70 వేలకు చేరే అవకాశం ఉంది. పెరుగుతున్న ధరల వల్ల గిరాకీలు తగ్గుముఖం పట్టాయి. మూడు నుంచి ఆర గ్రాము వరకే కొంటున్నారు.

- మాణిక్ కోర్‌వార్, బంగారం వ్యాపారి, నారాయణపేట

సామాన్యులకు భారం



పెరుగుతున్న బంగారం ధరలు సామాన్య మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా తులం బంగారం ధర రూ. 68,500కి చేరుకున్నది. ఇంకా పెరుగుతుందట, మా లాంటి మధ్యతరగతి కుటుంబాలు బంగారం కొనలేని పరిస్థితి ఏర్పడింది.

-మణెమ్మ గృహిణి, నారాయణపేట

కారు దిగి కాంగ్రెస్‌లోకి

- కొల్లాపూర్ మునిసిపాలిటీలో పట్టు కోల్పోతున్న బీఆర్ఎస్
- హస్తం గూటికి చేరిన కౌన్సిలర్లు
- చైర్మన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం
- అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీస్ అందజేత



కొల్లాపూర్ మునిసిపల్ కార్యాలయం

కొల్లాపూర్, మార్చి 21 : నాలుగేళ్ల పాలన పూర్తయ్యాక కొల్లాపూర్ మునిసిపాలిటీలో మొసలం మొదలైంది. మునిసిపల్ చైర్మన్ విజయలక్ష్మిపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి రంగం సిద్ధం చేశారు. గురువారం కొల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్‌కు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీస్ అందజేశారు. 2020 జనవరి 27న కొల్లాపూర్ మునిసిపాలిటీ పాలక మండలి ఏర్పడింది. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కూడా ఆ పార్టీకి చెందినవారే కావడంతో కొల్లాపూర్ మునిసిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. కొల్లాపూర్ మునిసిపాలిటీలో మొత్తం 20వార్డులకు గాను బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో కేవలం తొమ్మిది మంది సభ్యులు మాత్రమే కౌన్సిలర్లుగా గెలుపొందారు. మిగతా 11మంది ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు బలపర్చిన అభ్యర్థులు ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నుంచి గెలుపొందారు. దీంతో కంగుతిన్న బీఆర్ఎస్ కొల్లాపూర్ మునిసిపాలిటీని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎంపీ, ఎమ్మెల్యే ఎక్స్‌అఫిషియో ఓట్లతో కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు. ఆ తర్వాత ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరింది. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కొల్లాపూర్ ఎమ్మెల్యేగా జూపల్లి గెలుపొంది మంత్రి పదవి కూడా చేపట్టడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదు మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరారు. ఇందులో కొల్లాపూర్ మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగం అసెంబ్లీ ఎన్నికల్లో జూపల్లి గెలుపు కోసం పని చేశారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య ప్రస్తుతం 15మందికి చేరింది. ఇంకా కొల్లాపూర్ మునిసిపల్ పాలక మండలి గడువు సరిగ్గా పది నెలలు ఉండడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు.

మంత్రి జూపల్లి నిర్ణయమే శిరోధార్యం

అవిశ్వాస తీర్మానంతో కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎవరనే ఊహాగానాలకు త్వరలోనే మంత్రి జూపల్లి కృష్ణారావు స్వస్తి పలకనున్నారు. కష్టకాలంలో మొదటి నుంచి ఆయన వెంట నడిచిన వారికే ప్రాధాన్యమిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జనాభా దామాషా ప్రకారం చైర్మన్ పీఠం అధిరోహించే వర్గానికి చెందిన వారి ఓటు బ్యాంకు తమ పార్టీకి అనుకూలించేలా నిర్ణయాలు ఉంటాయని చివరికి మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్ణయమే శిరోధార్యమని కౌన్సిలర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు కొల్లాపూర్ మునిసిపాలిటీ పీఠం త్వరలోనే కాంగ్రెస్ పార్టీ కైవసం కానుంది.

బీఆర్ఎస్‌లో క్యాంప్ రాజకీయం

- గోవాకు తరలివెళ్లిన స్థానిక ప్రజాప్రతినిధులు
- కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో శ్రేణులను కాపాడుకునే పనిలో నేతలు
- త్వరలో కాంగ్రెస్ నాయకులు



వనపర్తి పట్టణంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాంపునకు వెళ్తున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

మహబూబ్‌నగర్/వనపర్తి అర్బన్/ నారాయణపేట/గద్వాల న్యూటౌన్, మార్చి21: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతో రాజకీయ నేతల్లో టెన్షన్ పెరుగుతోంది.. ఎవరు ఎప్పుడు పార్టీ మారుతున్నారో తెలియకపోవడంతో పార్టీ శ్రేణులను కాపాడుకునేందుకు నాయకులు చమటోడ్చాల్సి వస్తోంది. బీఆర్ఎస్‌కు సంఖ్యాబలం ఉన్నా కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు బీఆర్ఎస్ నాయకులను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రోజురోజుకూ ఫిరాయింపులు పెరుగుతుండటంతో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. ఇందులో భాగంగానే గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ బస్సులను ఏర్పాటు చేసి బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులను, ఎంపీటీసీ సభ్యులను, కౌన్సిలర్‌లను గోవాకు తీసుకెళ్లారు. ఈ క్యాంపుకు ప్రజాప్రతినిధులు కుటుంబసమేతంగా వెళ్లడం విశేషం. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గోవా ట్రిప్‌లో ఎంజాయ్ చేస్తుండగా కాంగ్రెస్ నేతల్లో టెన్షన్ మొదలైంది. ఎన్నికలకు వారం రోజుల సమయం ఉండటంతో ఇప్పటినుంచి క్యాంప్ రాజకీయం చేస్తే వారికి మర్యాదలు చేయడానికి బిల్లు తడిసి మోపెడవుతోంది. అయితే బీఆర్ఎస్‌లో ప్రజాప్రతినిధులను కాపాడుకోవాలంటే క్యాంప్‌కు తరలించడమే మార్గమని కీలక నేతల సూచన మేరకు వారం ముందుగానే క్యాంప్‌కు తరలించారు. మరికొందరు రేపు ఎల్లుండి వెళ్లనున్నారు. విజయంపై ధీమాగా ఉన్న కాంగ్రెస్ ఎన్నికలకు ఒకట్రెండురోజుల ముందు క్యాంప్‌కు తీసుకెళ్లాలని బావించినా, ఇప్పుడు బీఆర్ఎస్ శిబిరాలకు శ్రేణులను తరలించడం కాంగ్రెస్‌పై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో ఒకట్రెండ్రోజుల్లో కాంగ్రెస్ కూడా తమ ప్రజాప్రతినిధులను క్యాంప్‌కు తరలించేందుకు ప్లాన్ చేస్తోంది. ఇదిలా ఉండగా శిబిరంలో ఉన్నవారంతో తమ పార్టీకే ఓటు వేస్తారా అన్న బెంగ నేతలను వెంటాడుతోంది. బీఆర్ఎస్ క్యాంప్‌లో ఉన్నా క్యాంపునకు వెళ్లేముందు పలువురు తమకు హామీ ఇచ్చి వెళ్లారని కాంగ్రెస్ నాయ కులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల్లో మెజారిటీ ప్రజాప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ నాయకులు తాయిలాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ కారణంగా తమకు కచ్చితంగా మద్దతు ఇస్తారని కాంగ్రెస్ ధీమాలో ఉంది. బీఆర్ఎస్ మాత్రం మెజారిటీ ఎక్కువగా ఉన్నందున 10-20 శాతం ఓట్లు తారుమారైనా తమకు నష్టం ఉండదని విశ్వసిస్తోంది. వనపర్తి నియోజకవర్గంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో క్యాంపునకు తరలివెళ్లారు. నారాయణపేట నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు గురువారం నారాయణపేట బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ నుంచి నాలుగు బస్సుల్లో కుటుంబ సమేతంగా ప్రత్యేక బస్సుల్లో గోవాకు తరలి వెళ్లారు.

గద్వాల జిల్లాలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, మునిసిపల్ కౌన్సిలర్లు గురువారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గోవాకు తరలివెళ్లారు. వీరంతా ఈ నెల 28న ఎమ్మెల్సీ ఎన్నికల రోజు ఏకంగా పోలింగ్ కేంద్రానికే వస్తారని విశ్వసనీయంగా తెలిసింది.

కన్నకొడుకును కడతేర్చిన తల్లి

- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఘాతుకం



దేగ హరికృష్ణ (ఫైల్)

బిజినేపల్లి, మార్చి 21 : వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కోపంతో కన్న కొడుకు దేగ హరికృష్ణ(11)ను కన్నతల్లి కడతేర్చిన ఘటన కలకలం రేపింది. మృతుడి బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన దేగ రవీందర్, దేగ లక్ష్మి భార్యాభర్తలు. వారికి ముగ్గురు కుమారులు ఉండగా వారిలో చిన్నవాడైన హరికృష్ణ తల్లిదండ్రుల వద్దే ఉంటూ చదువుకుంటున్నాడు. పెద్ద కుమారులు ఇద్దరు గురుకుల పాఠశాలలో ఉండి చదువుకుంటున్నారు. భర్త రవీందర్ మద్యానికి బానిసకావడంతో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఆమె వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నది. బుధవారం అర్ధరాత్రి వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తి ఇంటికి రావడాన్ని హరికృష్ణ చూశాడని, అతని అడ్డు తొలగించుకోవాలని కొడుకు మర్మాంగాలపై తల్లి గాయపర్చింది. రోకలిబండతో తలపై బలంగా కొట్టి బెడ్‌షీట్‌లో చుట్టి ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడేసింది. గురువారం ఉదయం తన కుమారుడు నీటితొట్టిలో పడి మృతి చెందాడని భర్తను, గ్రామస్థులను నమ్మించే ప్రయత్నం చేసింది. కానీ, అనుమానం వచ్చిన బంధువులు నిలదీయడంతో తానే చంపినట్లు ఒప్పుకున్నది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి నిందితురాలిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధం వల్లే తన మనవడిని చంపినట్లు హరికృష్ణ చిన్న తాత దేగ శేఖర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

మండుతున్న ఎండలు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలు
- చిరువ్యాపారులకు తప్పని తిప్పలు - ఉపశమనం కోసం అగచాట్లు



వనపర్తి పట్టణంలో స్కార్ఫ్ కప్పుకొని వెళ్తున్న విద్యార్థినులు

అచ్చంపేట/వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 21: అచ్చంపేటలో రోజు రోజుకు ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపుడుతున్నాడు. ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండడంతో జనం బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వనపర్తి జిల్లావ్యాప్తంగా రెండు వారాల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండల దాటికి ఉదయం 10 గంటలు దాటిందంటే బయటకు వచ్చే జనాల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూ వస్తుంది. జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులు వీధులు అరకొర జన సంచారంతో దర్శనమిస్తున్నాయి. సాయంత్రం ఐదు గంటలు దాటిన తరువాతనే పూర్తిస్థాయిలో జనాలు రహదారులపైకి వస్తున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా గరిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. అచ్చంపేటలో ఇప్పటికే 35డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. రెండు రోజులుగా అక్కడక్కడ మబ్బులు పడినా ఉక్కపోత మాత్రం తగ్గడం లేదు. ఇదే అదునుగా బావిస్తున్న వ్యాపారులు ఏసీలు, కూలర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. గతేడాది కంటే ధరలు కూడా పెంచేశారు.



అచ్చంపేటలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూలర్లు



ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారిన వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా



ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారిన వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తా

ఏడుగురిపై న్యూసెన్స్ కేసు

అయిజ టౌన్, మార్చి 21 : అయిజ తహసీల్దార్ కార్యాలయంలో పెట్రోల్ బాటిళ్లతో హల్‌చల్ చేసిన సంఘటనలో గురువారం ఏడుగురిపై కేసు నమోదయ్యింది. అయిజ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఐదుగురు మహిళలు పెట్రోల్ బాటిళ్లతో వచ్చి తహసీల్దార్‌పై పోసి, వారూ పోసుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. ఘటనకు బాధ్యులైన రంగు లక్ష్మీదేవి, సుభద్రమ్మ, రోహిణి, రామేశ్వరమ్మ, గోవిందమ్మలతో పాటు వారికి సహకరించిన ఇద్దరు, మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ భాస్కర్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపునకు హైకోర్టు ఆదేశం

చారకొండ, మార్చి 21 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల పరిధిలోని శిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయ భూముల్లో అక్రమంగా నిర్మించిన 34 ఇళ్లు, దుకాణాలను శుక్రవారం తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని ఈవో మల్లెల రఘు గురువారం తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ఆలయ ఛైర్మన్ ఢేరం రామశర్మ హైకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా ఇళ్లు, దుకాణాలను నిర్మించుకున్న వారికి గతంలోనే నోటీసులు ఇచ్చామన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇళ్ల దుకాణాలను తొలగించనున్నట్లు ఈవో వెల్లడించారు.

రూ.1.66 లక్షల నగదు పట్టివేత

హన్వాడ, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. గురువారం నాయినోనిపల్లి సమీపంలో ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. మహ్మమదాబాద్ మండలానికి చెందిన గండె శ్రీనివాస్ అనే వ్యక్తి లక్ష రూపాయలు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతని వద్ద ఆ డబ్బుకు సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బు తీసుకెళ్లవద్దని తెలిపారు.

● గోపాల్‌పేట : వనపర్తి జిల్లా సరిహద్దుల్లో బుద్దారం గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన బుద్దారం చెక్ పోస్టు వద్ద పోలీసుల తనిఖీలలో మారం రవి కుమార్‌రెడ్డి వద్దనున్న రూ.66వేలను పోలీసులు సీజ్ చేశారు. ఎవరైనా బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మితే చట్టరీత్యా చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

▸ బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జడ్పీ చైర్‌పర్సన్

మల్దకల్, మార్చి 21 : సరదాగా ఈతకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో మునిగి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ఉలిగేపల్లి గ్రామానికి చెందిన బోయ హుసేన్ కుమారుడు వీరేందర్ (13) బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. బావిలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఆందోళనకు గురైన స్నేహితులు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు బావి వద్దకు చేరుకొని గాలించగా, బాలుడి మృతదేహం లభ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. విషయం తెలుసుకున్న బిజ్వారం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వీరేందర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంతాప సూచికగా పాఠశాలకు సెలవు ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులను జడ్పీచైర్‌పర్సన్ సరిత పరామర్శించారు.

మానవాళికి అడవులు ఆహార ఔషధం



గార్డెన్‌లోని మొక్కల గురించి వివరిస్తున్న డాక్టర్ సదాశివయ్య

జడ్చర్ల, మార్చి 21 : మానవాళికి అడవులు రక్షతో పాటు అవసరమైన ఆహారం, ఔషధం లాంటిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అటవీ అకాడమీ అసిస్టెంట్ కోర్స్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, ఆయనతో పాటు అకాడమీలో శిక్షణ పొందుతున్న 35 మంది అటవీ క్షేత్రాధికారులు గార్డెన్‌కు హాజరయ్యారు. అంతరించిపోతున్న సీతీ అశోక మొక్కను నాటి నీళ్లు పోశారు. ల్యాబ్‌లో ఉన్న పాములను అదేవిధంగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హెర్బేరియం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గార్డెన్ సమన్వయ కర్త డాక్టర్ సదాశివయ్య, పరిశోధక విద్యార్థి రమాదేవి, వలంటీర్లు రాహుల్, వీరాంజనేయులు, అనసూయ పాల్గొన్నారు.

జాబ్ మేళా విజయవంతం



జాబ్ మేళాకు హాజరైన విద్యార్థులతో అధ్యాపకులు

జడ్చర్ల, మార్చి 21 : పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిరుద్యోగులకు జాబ్ మేళా గొప్ప అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. రమాదేవి అన్నారు. జాబ్ మేళాలో 30 ఖాళీలు ఉండగా 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మార్గదర్శకులు ప్రతాప్, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ రీజినల్ మేనేజర్ సిరాజుద్దీన్, ఎల్అండ్‌టీ నరేష్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఉన్ని సహకార సంఘాలను మెరుగు పర్చుకోవాలి



ఉన్ని సహకార సంఘం సభ్యులతో జేఆర్ ఫ్యాకల్టీ బృందం

భూత్పూర్, మార్చి 21 : ఉన్ని సహకార సంఘాలను అందరు కలిసి కట్టుగా పనిచేసి సహకార సంఘాలను మెరుగు పర్చుకోవాలని తెలంగాణ ఉన్ని సహకార సంఘం యూనియన్ జాయింట్ రిజిస్ట్రార్(జేఆర్) ఫ్యాకల్టీ పరిమళదేవి సూచించారు. గురువారం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా ఉన్ని సహకార సంఘం అధికారి సంగీత తోపాటుగా జేఆర్ ఫ్యాకల్టీ బృందంతో కలిసి మునిసి పాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో ఉన్న ఉన్ని సహకార సంఘాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఫ్యాకల్టీ బృందం వారు ఉన్ని సహకార సంఘాలను ఏలా కాపాడుకోవాలి? ఎన్నిలు ఏలా జరుపుకోవాలి, సంఘంలో ఉన్న సభ్యుల బాధ్యతలు, సభ్యుత్వ నమోదు, సంఘాల నుంచి జరిగే లావాదేవిల గురించి ఫ్యాకల్టీ బృందం చక్కగా వివరించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ బృందం అధికారులు విజయలక్ష్మీ, పద్మ, సహకార సంఘం అధ్యక్షురాలు చెన్నమ్మ, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నల్లమట్టి తరలింపు



చెరువులో నల్లమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, నింపుతున్న జేసీబీలు

అచ్చంపేట రూరల్, మార్చి 21 : ప్రభుత్వం నల్ల(ఒండ్రు) మట్టి, ఇసుక రవాణాపై నిబంధనలు ప్రభుత్వం కఠినతరం చేస్తున్నా అక్రమార్కులు బేఖాతరు చేస్తున్నారు. విచ్చలవిడిగా మట్టిని, ఇసుకను తరలిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలోని చెరువులో నుంచి మట్టిని అక్రమార్కులు ఎక్స్‌కవేటర్లు పెట్టి పదులసంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా పంట పొలాలకు, ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ కే.మురళీ మోహన్‌ను వివరణ కోరగా రంగాపూర్ చెరువులో మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అది తమ పరిధిలో లేదన్నారు. ఈ విషయమై ఐబీ రమేష్‌ను వివరణ కోరగా మట్టి తరలింపునకు తమ శాఖ నుంచి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. గ్రామస్థులు ద్వారా తమకు బుధవారం రాత్రి తెలిసింది. వెంటనే తహసీల్దార్‌కు తెలిపి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామస్వామి ద్వారా అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించానన్నారు. చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టిని తరలించరాదని ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ రాము మాట్లాడుతూ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు రంగాపూర్ చెరువు వద్దకు వెళ్లాం. చెరువు దగ్గర ఖాళీ ట్రాక్టర్లు ఉన్నవి. ట్రాక్టర్ల వద్ద ఉన్న కాగితాలను పరిశీలిస్తున్నాం. అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు తేలితే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

టీకాలతో పశువులకు రక్షణ

▸ జిల్లాలో 1,47,800 పశువులు ▸ నెల రోజులు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు

▸ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు ▸ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏటా రెండు సార్లు టీకాల పంపిణీ



వీరన్నపేట పశు వైద్యశాలలో టీకా వేస్తున్న డాక్టర్ జి.రాంప్రసాద్

పాలమూరు, మార్చి 21 : పశు ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మార్చి నెల అంతటా పశువులకు టీకాలు వేయనున్నారు. వానాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాధి నిరోధక టీకాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రత్యేక శిబిరాల్లో భాగంగా పశువైద్య సిబ్బంది స్వయంగా ప్రతీ గ్రామానికి వెళ్లి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లో దశలవారీగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేసిన ప్రతీ పశువు చెవికి పోగులు వేసి ట్యాగ్ రూపంలో ఆన్‌లైన్ పోర్టల్ నమోదు చేస్తారు. అప్పటికే చెవిపోగు ఉంటే ఆన్‌లైన్‌లో భారత్ ధన్(పశు ఆరోగ్యం)ద్వారా నమోదు చేస్తారు.

టీకాలతో వ్యాధి నిరోధక శక్తి

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆవులు, బర్రెలు, గేదెలు 1,47,800లు ఉన్నాయి. అందులో మార్చి 19వ తేదీ నాటికి 94,183 పశువులకు పశువైద్య బృందం టీకాలు వేసింది. జిల్లాలో వైద్యులతో కూడిన 26 ఆసుపత్రులు, కంపౌండర్ చేత నడిచే 44 ఆసుపత్రుల్లో(26+44=70) టీకాలు వేస్తున్నారు. ఒక గ్రామంలో టీకాలు వేసే ముందురోజే చాటింపు వేయిస్తారు. అయితే పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని సకాలంలో గుర్తించి నివారించడం తప్పా పూర్తిగా నిర్మూలించేందుకు మందులు లేవు. వ్యాధి సోకిన పశువుకు 14 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి దగ్గర, కాలిగిట్టల వద్ద బొబ్బలు కడతాయి. దాంతో నడవటం, మేత మేయటం ఇబ్బందిగా ఉంటుంది. పశువులు నీరసించిపోవడంతో పాల దిగుబడి తగ్గిపోవటం, పని సామర్థ్యం తగ్గిపోతుంది. వ్యాధి సోకిన పశువుల్లో ఐదుశాతం మృత్యువాతకు కూడా గురవుతాయి. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రతీ ఏడాది రెండుసార్లు ఉచితంగా టీకాలు అందిస్తోంది. ఈ టీకాల వల్ల పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి, గాలికుంటు వ్యాధి, ఇతర వ్యాధులు సోకకుండా రక్షణ గా ఉంటుంది.

పశువులు కలిగిన రైతులు ఉపయోగించుకోవాలి



పశువుల్లో వస్తున్న వ్యాధుల నివారణకు ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పశువులు కలిగిన రైతులు ఉపయోగించుకోవాలి. మార్చి నెల అంతటా టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. అన్ని పశు వైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. టీకాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది.

- డాక్టర్ జి.రాంప్రసాద్, పశువైద్యాధికారి, వీరన్నపేట పశు వైద్యశాల

రైతుల ఫిర్యాదుపై అధికారుల విచారణ

▸ ఇసుక తరలింపు ప్రదేశాన్ని పరిశీలించిన జిల్లా మైనింగ్ అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న రైతులు, నాయకులు

మిడ్జిల్, మార్చి 21 : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులోని నిల్వచేసిన ఇసుక తరలింపు ప్రదేశాన్ని గురువారం జిల్లా మైనింగ్ సర్వేయర్ సుజాత, సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి ఏఈ, ఆర్ఐ అంబికలు పరిశీలించారు. ఇసుక తరలింపులో అవతవకలు జరిగాయంటూ జిల్లా అధికారులకు అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన రైతులు, పలుపార్టీల నాయకులు ఫిర్యాదు చేయడంతో మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఇసుక తరలింపు ప్రదేశాన్ని పరిశీలించారు. ఇసుక నిలువలకు సంబంధించిన కొలతలను తీసుకున్నట్లు మైనింగ్ సర్వేయర్ సుజాత తెలిపారు. తనకు తెలియకుండా, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వేనెంబర్ 386/2లో గల భూమిలో ఇసుకను డంపు చేసి, మళ్లీ ఇసుకను తరలిస్తున్నారని, తన భూమిలో ఉన్న ఇసుకను తరలించవద్దని రైతు పండుగ బాల్‌రెడ్డి అక్కడే ఉన్న అధికారులకు తెలియజేశారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి నిర్మాణం పేరుమీద ఇసుక తరలింపునకు అనుమతులు పొంది, జడ్చర్ల పట్టణ శివారులో ఉన్న ఫార్మ కంపెనీలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు ఎందుకు నోరు మెదపడంలేదని పలువురు రైతులు ప్రశ్నించారు. కల్వకుర్తి వైపు వెళుతున్న ఇసుక టిప్పర్లను తాము పట్టుకొని అప్పగించేంత వరకు అధికారులు ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవటంలేదని అక్కడే ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించారు. మొత్తం వెయ్యి టిప్పర్లకు పైగా ఇసుకను తరలించారని సూపర్‌స్పెషలిటీ ఆస్పత్రికి తరలించింది మాత్రం 170 ట్రిప్పులు మాత్రమేనని, మిగతా ఇసుక మొత్తం ఎక్కడికి వెళ్లిందో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మండలంలోని ఇసుక కొరత తీవ్రంగా ఉందని, అయ్యవారిపల్లి గ్రామ శివారులోని నిల్వ చేసిన ఇసుకను మండలంలోని ప్రభుత్వ పనులకు, ఇంటి నిర్మాణాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు అనుమతులివ్వాలని ఎంపీపీ సుదర్శన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు లాలు అధికారులను కోరారు. అధికారుల వెంట తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, రెవెన్యూ సహాయకుడు అంజితో పాటు నాయకులు గోపాల్, రఘు, కృష్ణయ్య, రామకృష్ణ, శివాజీ ఉన్నారు.

చందాపూర్‌లో దొంగల హల్‌చల్

▸ పలు ఇళ్లలో చోరీ



రేఖా శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న అచ్చంపేట సీఐ

అచ్చంపేట రూరల్, మార్చి 21 : అచ్చంపేట మండలం చందాపూర్ గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడిన ఘటన గురువారం మధ్య రాత్రి చోటు చేసుకుంది. అచ్చంపేట ఎస్ఐ రాము కథనం ప్రకారం.. చందాపూర్ గ్రామానికి చెందిన రేఖా శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో నిద్రపోతున్న సమయంలో పాత ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువా పగలగొట్టి రెండు తులాల బంగారం, 20తులాల వెండి గొలుసులు, రూ. 50వేల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. అలాగే ఎమిరెడ్డి రామిరెడ్డి కూడా తన కుటుంబ సభ్యులతో మేడ మీద నిద్రిస్తుండగా ఇంట్లోకి చొరబడ్డ దొంగలు రూ. 15వేల నగదు దొంగిలించారు. అలాగే ఇంటికి తాళాలు వేసి వేరే గ్రామాలకు వెళ్లిన తిప్పర్తి నర్సిరెడ్డి, తిప్పర్తి ప్రమీలమ్మ ఇంటి తాళాలు పగలగొట్టారని ఇతర గ్రామాలకు వెళ్లిన వీరు వస్తేనే దొంగిలించబడ్డ సొత్తు గురించి తెలుస్తుందని ఎస్సై తెలిపారు. గ్రామంలోని పాఠశాల ఆవరణలో దొంగతనానికి ఉపయోగించిన గడ్డపార, తాళాలను పడవేసి వెళ్లారని క్లూస్‌టీమ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

రేవల్లి, మార్చి 21 : వనపర్తి జిల్లా రేవల్లి మండలం శానాయిపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగనమోని వెంకటేష్ తన సొంత గ్రామమైన బండరాయిపాకుల గ్రామంలో కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. ఇల్లు నిర్మాణంలో ఉండడంతో పక్క గ్రామమైన శానాయిపల్లిలో రాఘవేందర్ అనే వ్యక్తి ఇల్లు అద్దెకు తీసుకొని అందులో నివాసముంటున్నాడు. మంగళవారం బుద్దారం గ్రామంలోని తన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో అక్కడికి వెళ్లాడు. తిరిగి బుధవారం రాత్రి ఏడు గంటలకు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తాళం పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచి ఉంచిన రూ.20 వేల నగదు చోరీకి గురైందని గుర్తించాడు. గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిజాయతీ చాటుకున్న కానిస్టేబుల్

నవాబ్‌పేట, మార్చి 21 : తనకు దొరికిన సెల్‌ఫోన్, నగదు, విలువైన డాక్యుమెంట్లు గురువారం ఓ కానిస్టేబుల్ పోలీసులకు అప్పగించి తన నిజాయతీ చాటుకున్నాడు. మండలంలోని యన్మనగండ్ల గ్రామానికి చెందిన కానిస్టేబుల్ వెంకట్రాములు రాజాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రం నుంచి పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో వస్తుండగా యన్మనగండ్ల గేట్ వద్ద ఓ సెల్‌ఫోన్, రూ.500లు, విలు వైన డాక్యుమెంటు దొరికింది. దీంతో ఫోన్ ఆధారంగా మహబూబ్‌నగర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన ఓ యువకునివిగా గుర్తించి సమాచారం ఇచ్చారు. అయినా వారు రాకపోవడంతో గురువారం సాయంత్రం నవాబ్‌పేట ఎస్ఐ అభిషేక్ రెడ్డికి సమాచారం ఇచ్చి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరితచిత వ్యక్తుల వస్తువులు ఏవైనా దొరికితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలను కోరారు. సెల్‌ఫోన్ విలువ రూ.30,000లు ఉంటుందని, ఇది అందజేసిన కానిస్టేబుల్ నిజాయతీ చాటుకోవడం అభినందనీయమని కొనియాడారు. వెంకట్రాములును పోలీస్ సిబ్బంది అభినందించారు.



సెల్ ఫోన్ అందజేస్తున్న కానిస్టేబుల్ వెంకట్రాములు

భారీగా మద్యం పట్టివేత



తనిఖీలలో పట్టుబడిన మద్యం

గోపాల్‌పేట, మార్చి 21 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు సోదాలు నిర్వహించి భారీగా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై హరిప్రసాద్ గురువారం మండలంలోని ఏదుట్ల గ్రామంలో బెల్ట్‌షాపు నడిపిస్తున్న మూడు షాపులపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. ఏదుట్ల గ్రామంలోని బాలరాజు కిరాణం షాపులో 14 లీటర్ల మద్యం (రూ.6489), కుమ్మరి లింగయ్య కిరాణం షాపులో 15 లీటర్ల మద్యం (రూ.13,425) స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏదుల గ్రామంలో అక్రమంగా సారా అమ్ముతున్న సీతమ్మ గుడిసెలో పోలీసులు తనిఖీ నిర్వహించి ఎనిమిది లీటర్ల సారాను పంచనామా నిర్వహించి, సీజ్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● రాజాపూర్ : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో బెల్ట్ షాపులపై గురువారం పోలీసులు దాడులు చేశారు. గ్రామంలోని ఓ కిరాణ దుకాణంలో 18 బీరు బాటిళ్ల స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ చెప్పారు.

● అడ్డాకుల : అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న కిరాణ దుకాణం నుంచి పోలీసులు గురువారం సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కాటవరం గ్రామంలో కొల్లంపల్లి అనే వ్యక్తి తన కిరాణ దుకాణంలో ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లుగా ఎస్ఐ తెలిపారు. 20 లీటర్ల వివిధ బ్రాండ్‌లకు సంబంధించిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బెల్ట్‌షాపులో..

గట్టు : మండల పరిధిలోని ఇందువాసి గ్రామంలో బెల్ట్‌షాపుపై పోలీసులు దాడులు నిర్వహించారు. దుకాణంలోని 73 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ. 35 వేల పైచిలుకు ఉంటుందని రామకృష్ణ తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడు భీమన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నారాయణపేట : ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో కర్ణాటక మద్యం లభ్యమైంది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం తిమ్మారెడ్డిపల్లి తండాలో చోటుచేసుకుంది. పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారుల బృందం దాడులు చేపట్టింది. కర్ణాటకకు చెందిన ఓరిజినల్ చాయిస్ 180 ఎంఎల్ 47 బాటిళ్లను స్వాధీనం చేసుకొని రాథోడ్‌నాయక్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దాడులో ఎక్సైజ్ ఎస్ఐలు శీల, రమేష్, హెడ్‌కానిస్టేబుల్ రాంరెడ్డి, కానిస్టేబుల్స్ రాంరెడ్డి, సంతోష్, సూర్యనారాయణ, గౌషియా పాల్గొన్నారు.

● ఊట్కూర్ : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం సమిస్తాపూర్ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో చేసి 71 లీటర్ల అక్రమ మద్యంను పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లాలోని సంక్లాపూర్ గ్రామం దాటిన తర్వాత మండలంలోని సమిస్తాపూర్ గ్రామ శివారులో జగదీష్ అనేని తనిఖీ చేయగా 71 లీటర్ల మద్యం పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.28,380 ఉంటుందని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దండ, మార్చి 21 : మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బ్లూకోట్ పోలీసులు పట్టుకున్నారు. చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన బాలస్వామి నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలస్వామిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

అడ్డాకుల, మార్చి 21 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. 17 ఏళ్ల వయస్సు గల బాలిక ఈ నెల 19వ తేదీన ఇంటి నుంచి బయటి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు రెండు రోజులుగా బంధువుల ఇళ్లల్లో బాలిక ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బాలిక తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకట్‌రెడ్డి (ఫైల్)

అడ్డాకుల, మార్చి 21 : మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మందడి వెంకట్‌రెడ్డి(55) గురువారం ఉదయం మోటారు సైకిల్‌పై తన వ్యవసాయ పొలానికి పోయి తిరిగి వస్తుండగా అడ్డాకుల గ్రామం దగ్గర రోడ్డు దాటుతుండగా అలంపూర్ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు వేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న మందడి వెంకట్‌రెడ్డి మోటారు సైకిల్‌ను ఢీకొన్నది. ఈ సంఘటనలో ఆయనకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతునికి భార్య మంజుల, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

మిద్దెపై నుంచి జారి పడి..

అలంపూరు మార్చి 21 : మిద్దె మెట్ల మీద నుంచి దిగుతూ జారిపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండల పరిధిలోని బుక్కాపురం గ్రామానికి చెందిన స్వాములు (32) అనే వ్యక్తి బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటిపక్కనే ఉన్న చెట్టు నుంచి మునగకాయలు కోసేందుకు మిద్దె మీదకు ఎక్కాడు. కాయలు కోసుకొని మెట్లమీదుగా కిందకు వస్తూ కాలు జారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైన ఆయనను తల్లి చెంచమ్మ, అలంపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఎడ్లబండి ఢీకొని..

బిజినేపల్లి, మార్చి 21 : ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పడంతో ఎడ్ల బండికి ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, మరో కరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామానికి చెందిన దస్తగిరి (30),తాక్రే నాయక్ బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టింది. స్థానికులు వెంటనే 108లో జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ దస్తగిరి మృతి చెందాడు. తాక్రే నాయక్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..

గద్వాల, మార్చి 21 : పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండల పరిధిలోని కొండపల్లి సమీపంలోని 99వ ప్యాకేజీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, డోన్‌కు చెందిన శివమల్లారెడ్డి (38) ఓ కాంట్రాక్టర్ దగ్గర సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కవారు గమనించి ఆయనను గద్వాలలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తీసు కెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు భార్య నాగరత్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో..

మహబూబ్‌నగర్, మార్చి 21 : గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన షేక్ మస్తాన్ (42)కు లారీ ఉంది. ఈనెల 19న సత్తుపల్లి నుంచి తన లారీలో బొగ్గులు తీసుకుని రాయిచూర్ బయలుదేరాడు. 20 నారాయణపేట జిల్లా కృష్ణా చెక్‌పోస్ట్ వద్ద రవాణాశాఖ అధికారులు వాహనాన్ని తనిఖీ చేసి సరైన పేపర్‌లు లేవని లారీని ఆపేశారు. లారీని అక్కడే నిలిపి వేయడంతో షేక్ మస్తాన్ తీవ్ర మనస్తాపంతో బస్సులో మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. తెలంగాణ చౌరస్తాలో దిగి కుప్పకూలి పడిపోయాడు. గమనించిన స్థానికులు జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు గురువారం జిల్లా కేంద్రానికి వచ్చి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లారీని ఆపడం వల్లే మనస్తాపానికి గురై తన సోదరుడు గుండెపోటుతో మరణించాడని మృతుడి సోదరుడు మక్బూల్ పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మాపూర్ ఎంపీటీసీని పరామర్శించిన ఎమ్మెల్యే



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, మార్చి 21 : అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న అమ్మాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు అంకూరి భాగ్యశ్రీని గు రువారం జడ్చర్ల ఎమ్మెల్యే జనుం పల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. కొంత కాలంగా భాగ్యశ్రీ కిడ్నీ వ్యాధి తో బాధపడుతూ ఇటీవల సర్జరీ చేయించుకున్నది. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే ఆమె భర్త నర్సింహులును కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నర్సింహులు, అజహర్, బోవొళ్ల రాజశేఖర్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 21 : పార్లమెంట్ ఎనికల నేపథ్యంలో జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ తెలిపారు. జిల్లాలో పోలీస్, ఎఫ్.ఎస్.టి. సర్వైలెన్స్ టీమ్‌ల ద్వారా తనిఖీలలో తగిన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకెళ్తున్న నగదు, లేదా ఇతర వస్తువులపై పరిశీలించి విడుదల చేసేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం, రెండవ ఫ్లోర్ రూమ్ నెంబర్ 220లో ఈ కమిటీ పని చేస్తుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా స్థాయిలో పోలీస్, సర్వేలైన్స్ బృందాలు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విడుదల చేసేందుకు సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారుల ద్వారా వచ్చే కేసులను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి బి. రాఘవేందర్ రావు, జిల్లా ఆడిట్ అధికారి ఎం. శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి బి. పద్మ, ట్రెజరీ శాఖ ఉప సంచాలకులు బి. శ్రీనివాస్‌లతో ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలిస్తుందని అన్నారు. పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ బృందాలు తనిఖీలో సరైన ధ్రువపత్రాలు, ఆధారాలు లేకుండా, ఎఫ్.ఐ.ఆర్ లేకుండా స్వాధీనం చేసుకున్న నగదు బ్యాంక్, ట్రెజరీలో డిపాజిట్ చేస్తారని పేర్కొన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ప్రతీ రోజు సమావేశం జరిపి ఆధారాలు లేకుండా పట్టుబడిన నగదు, వస్తువుల స్వాధీనంపై పోలీస్ పంచనామా కాపీ, డాక్యుమెంట్లు, ట్రెజరీ డిపాజిట్ రసీదు, పట్టుబడిన కేసులలో వ్యక్తుల సరైన ఆధారాలు సమర్పించిన కేసులలో రూ.10 లక్షల లోపు ఉంటే 24 గంటల లోపు రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. రూ.10 లక్షల పైబడిన నగదు, వస్తువులు స్వాధీనం చేసుకున్న కేసులలో వాణిజ్య పన్నుల శాఖ, ఇన్‌కం టాక్స్ శాఖ సమాచారం అందించి క్లియరెన్స్ రాగానే విడుదల చేస్తుందని అన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకొని వెళ్లవద్దని ఆయన సూచించారు. ఎక్కువ మొత్తం నగదు దొరికితే ఆ మొత్తం సీజ్ చేసి, డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధం లేదని సరైన ఆధారాలు చూపిస్తే తిరిగి ఇచ్చేస్తారని, అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు నగదును తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో నగదును తీసుకెళ్లాలని కలెక్టర్ తెలిపారు.

డీకే అరుణకు ఘన సన్మానం



పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సన్మానంలో రాష్ట్ర నాయకుడు బాలన్న

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), మార్చి 21 : దేశం కోసం మోదీ, పాలమూరు కోసం అరుణమ్మ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణ పిలుపునిచ్చారు. గురువారం ఆమెను తన స్వగృహంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలన్న ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట్, భూత్పూర్, కొత్తకోట, అడ్డాకుల మండలాలకు చెందిన 100 మంది బీజేపీ కార్యకర్తలు డీకే అరుణను ఘనంగా సన్మానించి. డీకే అరుణ మాట్లాడుతూ పాలమూరు అభివృద్ధికి శక్తికి మించి పని చేస్తానని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం, ప్రాజెక్టుల కోసం ఎన్నో పోరాటాలు, నిరాహారదీక్షలు చేశానని ఆమె గుర్తు చేశారు. కేసీఆర్‌లా, కాంగ్రెస్ నాయకుల్లాగా దొంగ దీక్షలు చేయలేదన్నారు. పాలమూరుకు ముఖ పరిచయం లేనోళ్లు ఓట్లకోసం వస్తున్నారని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. బాలన్న ఆధ్వర్యంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ తదితరులు

నవాబ్‌పేట, మార్చి 21 : విద్యార్థులు చిన్న నాటినుంచే లక్ష్యం ఏర్పాటు చేసుకొని అడుగులు వేయాలని ఇప్పటూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ అన్నారు. గురువారం మండ లంలోని ఇప్పటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెంబ్‌క్రాప్ గ్రీన్ ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్, మౌలీఆర్ట్స్ ప్రైవేవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను సంస్థ ప్రతినిధులు నాగరాజు, ప్రజ్నేష్, అభిజిత్, శ్రీవాణిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలలకు ప్రైవేటు కంపెనీలు సహకారం అందించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సీఎంవో బాలు, శ్రీనివాసులు సందర్శించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, కరోలీన్, ఆయూబ్‌ఖాన్, రామమహేశ్వర్, సీఆర్పీ జనార్ధన్ పాల్గొన్నారు.

లింగాయత్ లింగ బలిజ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఏర్పడిన బలిజ సంఘం కమిటీ

బాలానగర్, మార్చి 21 : లింగాయత్ లింగబలిజ మండల కమిటీని గురువారం ఎన్నికైంది. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సిద్దిలింగం, అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి వినోద్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నటుల మండల అధ్యక్షుడిగా రాఘవేందర్ తెలిపారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా శరభయ్య, అధ్యక్షుడిగా రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా బసవరాజ్‌తో పాటు మరి కొందరిని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతనం మహిళా కమిటీ మండల గౌరవ అధ్యక్షురాలిగా రాజేశ్వరి, అధ్యక్షురాలిగా సునీత, ప్రధాన కార్యదర్శిగా మమత, కోశాధికారిగా వసంత, సభ్యులను మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగశ్రీ, ప్రధాన కార్యదర్శి శ్రీదేవిల సమక్షలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ లింగాయత్ లింగ బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

తడిలేని మడులు..

తల్లడిల్లుతున్న రైతులు

- కోయిల్‌సాగర్ కింద ఎండుతున్న పంటలు
- పొట్టదశలో వరి పంట
- నీరు విడుదల చేయాలని కర్షకుల వేడుకోలు



బల్సుపల్లిలో ఎండి వరిపంట

దేవరకద్ర, మార్చి 21 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద సాగునీరు అందకపోవడంతో ఆయకట్టులో పంటలు ఎండుతున్నాయి. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద ఉన్న దేవరకద్ర, ధన్వాడ మరికల్ చిన్నచింతకుంట మండలాల పరిధిలోని సుమారు 12వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఐదు విడతల్లో సాగు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో పది రోజుల చొప్పున ప్రకటించారు. ప్రసుత్తం పంటలు పొట్ట దశకు చేరుకున్నాయి. ఈ దశలో 15 రోజుల విరామం అమలు చేయటంతో పంటలన్నీ ఎండుముఖం పట్టి రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయకట్టుకు నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. కోయిల్‌సాగర్ జలాశయం పూర్తి సామర్థ్యం 2.23 టీఎంసీలు కాగా ప్రస్తుతం ఒక టీఎంసీ నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం కుడి, ఎడమ కాల్వల కింద 12 వేల ఎకరాలలో వరి సాగు చేశారు. ఒక్కో ఎకరాకు 30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. 15 రోజుల విరామం వల్ల పొలాలన్నీ ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, అధికారులు నీటిని అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటికి ప్రాధాన్యం

జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో కోయిల్‌సాగర్ జలాశయంలోని నీటిని పంటలతో పాటు మహబూబ్‌నగర్, కోడంగల్ ప్రాంతాలకు తాగునీటి అవసరాలకు అందిస్తాం. ఆయకట్టుకు కేటాయించిన 0.04 టీఎంసీల నీటిని పంటలకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

- ప్రతాప్‌సింగ్, ప్రాజెక్టు ఈఈ

పెట్టుబడి వచ్చేలా లేదు

కోయిల్‌సాగర్ ప్రాజెక్టును నమ్ముకొని నాకున్న ఎకం పొలంలో వరి సాగు చేశాను. ఆయకట్టు నుంచి నీటిని విడుదల చేసినా పంటకు నీరు అందక ఎండిపోయింది. 30 వేల రూపాయల పెట్టుబడి అయ్యింది. కళ్లముందు పంట ఎండిపోయింది. అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

- అనంతులు రైతు, బల్సుపల్లి

డీకే అరుణపై ఆరోపణలు సరికాదు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఫైర్

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), మార్చి 21 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఏదో తనకు మైలేజీ పెరుగుతుందనుకుంటే అది నీ భ్రమ అని, నష్టపోయేది నువ్వే అని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆయన గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన మీరు 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యక్షమైనవని విమర్శించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే స్థానానికి డబ్బులు తీసుకొని టికెట్ అమ్ముకున్నారని ఆరోపణలు నీపై వస్తే ఎందుకు స్పందిచలేదని ప్రశ్నించారు. నిన్నగాక మొన్న భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి ఇంటికి స్వయాన ముఖ్యమంత్రి పోయి ఆహ్వానించింది అప్పుడే మరిచావా అని ప్రశ్నించారు. చిల్లర ఆరోపణలు చేయడం మాను కోవాలని ఆయన ఘాటుగా హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణవర్ధన్ రెడ్డి, క్రిష్ణనాయక్, కార్యదర్శి బుచ్చిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, కౌన్సిలర్ రామాం జనేయులు, చిన్న వీరయ్య, జిల్లా నాయకులు ప్రవీణ్ యాదవ్, గోవింద్ నాయక్, పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు పాటుపడాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 21 : పర్యావరణాన్ని కాపాడితే జీవుల మనుగడకు ఇబ్బంది ఉండదని, పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రిస్టియన్‌పల్లి, శ్రీరామకాలనీలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు విధిగా ఒక మొక్క నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి లోపు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 21 : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో 2024-2025 సంవత్సరానికి గాను ఆరవ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగిలిన సీట్ల కోసం గిరిజన విద్యార్థులు ఈ నెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష వచ్చే నెల 21న ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి నలుగురు కౌన్సిలర్లు

● కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే యెన్నం

● కేసీఆర్‌తో డజన్, మాజీమంత్రితో అరడజన్ నేతలే మిగిలేది



కౌన్సిలర్ ఉమర్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, మార్చి 21 : పాలమూరు పురపాలికలో అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చి నూతన చైర్మన్‌ను ఎన్నుకోవడంతో సహకరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుకుంటున్నారు. ఇప్పటికే పలు విడతల్లో దాదాపు 15 మంది వరకు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా, గురువారం మరో నలుగురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో 12వ వార్డు కౌన్సిలర్ ఉమర్, 33వ వార్డు కౌన్సిలర్ మునీర్, 45వ వార్డు కౌన్సిలర్ మాధవిలత, 26వ వార్డు కౌన్సిలర్ సుల్తానాలు పార్టీలో చేరగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కానుందని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ తరువాత ఆ పార్టీ పరిస్థితి ఏంటో కార్యకర్తలకు, నాయకులకు అర్థమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ వెంట డజన్ మంది, ఇక్కడ మాజీమంత్రి వెంట అరడజన్ మంది మాత్రమే మిగులుతారని, అంతా ఖాళీ కాబోతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అవినీతి, అరాచకం, దోపిడీ జరిగిందని, గత ప్రభుత్వ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన అరాచకాలు, అవినీతిపై చట్టబద్ధమైన చర్యలుంటాయని, వాళ్ల జైలుకు వెళ్లక తప్పదన్నారు. పదేళ్లుగా దోచుకోవడం దాచుకోవడం తప్పా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీగా అభివృద్ధి చేసుకునే బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీపై ఉందని అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో వార్డుల అభివృద్ధికి రూ.40 కోట్లు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు చేపడతామని ఎమ్మెల్యే వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి సీఎంకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, షబ్బీర్, సిరాజ్‌ఖాద్రి, సీజే బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, బెక్కరి అనిత, పాషా, ఫయాజ్, అన్వర్, శివశంకర్, సాదిక్, రమేశ్ పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి విజయం కోసం కార్యకర్తలు శ్రమించాలి

- బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీఎంఆర్, అనిరుధ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్, పక్కన ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

దేవరకద్ర/ భూత్పూర్/ జడ్చర్ల, మార్చి 21 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తన విజయం కోసం కార్యకర్తలు శ్రమించాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకద్ర, భూత్పూర్, జడ్చర్లలో బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. దేవరకద్రలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, భూత్పూర్‌లోని బీఎల్ నారాయణ పాఠశాల ఆవరణలో బూత్‌స్థాయి ఏంజెట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బూత్ లెవల్ ఏజెంట్ వారికి కేటాయించిన వార్డులో పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి ఓరు లిస్టులో ఓటరు పేరు ఉందా? లేదా అనే విషయాన్ని గమనించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఓటరు లిస్టులో తొలగించిన ఓటర్లను ఏవిధంగా చేర్చుకోవాలి? అదే విధంగా కొత్త ఓటర్లను ఏవిధంగా నమోదు చేసుకోవాలి అనే విషయాలను ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. దేశంలో ఎక్కడా ప్రజాప్రతినిధులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు లేవని, కేవలం తెలంగాణలోనే ప్రజాప్రతినిధులు అత్యహత్యలు చేసుకున్నారని వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఒక్క తెలంగాణలోనే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీలు, జడ్పీటీసీలకు కూడా అధికారాలు లేకుండా అంతా తామే అన్నట్లుగా గత పాలకులు వ్యవహరించారని తెలిపారు. పాలమూరు బీజేపీ నాయకులు తమ పదవుల కోసం కొట్లాడారు తప్ప గతంలో స్వయంగా మోదీ ఇచ్చిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా గురించి ఏ ఒక్కరూ మాట్లాడలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఏమీ చేయలేదన్నారు. ఇక్కడ గెలిచే ఎంపీ సీటు దేశంలో రాహుల్ గాంధీ ప్రధాని కావడం కోసం తొలిమెట్టుగా ఉపయోగపడుతుందన్నారు. దేవరకద్ర కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరి అరవింద్ కుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు, కార్యకర్తలు, భూత్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల యువజన అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ మాసగౌడ్, ఆగిరి రవి, వివిధ గ్రామాల నాయకులు, బూత్‌స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.

నేడు పూలే-అంబేడ్కర్ జాతర కమిటీ సమావేశం

పాలమూరు, మార్చి 21 : పూలే-అంబేడ్కర్ నాలుగవ జాతర ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశం ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు బోయపల్లి నరసింహులు, మామిడి సామెల్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం కరపత్రం ఆవిష్కరణ, జాతర విజయవంతం చేయటానికి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎన్నికల నింబంధనలు పాటించాలి

దేవరకద్ర, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలో ఉన్నందున ప్రతీ ఒక్కరు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎంపీడీవో శ్రీనివస్‌రావు, ఈవో సీత్యానాయక్ తెలిపారు. ఎల్లక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ కార్యాలయాల్లో, ఎక్కడ కూడా రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, జెండాలు, ఫెక్సీలు ఉండరాదన్నారు. ఉంటే వెంటనే తొలగించాలని కోరారు. ఎంపీడీవో, ఈవో ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు.

'రూ.50 వేలకు మించితే ఆధారాలు తప్పనిసరి'

దేవరకద్ర, మార్చి 21 : ఎన్నికల కోడ్ అమలోకి వచ్చినందున రూ.50 వేలకు మించి ఎవరూ నగదు తీసుకెళ్లవద్దని ఎస్ఐ నాగన్న అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరూ రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని, తీసుకెళితే వాటిని సీజ్ చేస్తామన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్



వెబెక్స్ ద్వారా సమీక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్


మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 21 : ఈ నెల 28న జరుగుతున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక ఏర్పాట్లపై నియోజకవర్గ పరిధిలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల ఏఆర్‌ఓలు, ఉప ఎన్నిక నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షించారు. ఉప ఎన్నిక నిర్వహణ పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఏఆర్వోలు, నోడల అధికారులు సమన్వయంతో పనిచేసి భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. ఉప ఎన్నిక నిర్వహణకు పోలింగ్ సిబ్బంది సెక్టార్ అధికారులు, మైక్రో అబ్జర్వర్, పీవో, ఏపీవో ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించి ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా పీవో, ఏపీవో, ఇతర పోలింగ్ సిబ్బందికి మొదటి, రెండవ ఈ నెల 23, 26 తేదీలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఉప ఎన్నిక బ్యాలెట్ పేపర్లో ప్రాధాన్యత ప్రకారం అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలకు భిన్నంగా నిర్వహించడం జరుగుతుందని, ఓటింగ్ విధానంపై శిక్షణలో వివరించాలని అన్నారు. ఉప ఎన్నికకు 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాన్ని కూడా మహబూబ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 27 పోలింగ్ మెటీరియల్, పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీతో పాటు సూక్ష్మ పరిశీలకులను నియమించనున్నట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ బాక్స్‌లు సమకూర్చుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వాహనాల అవసరాన్ని అంచనావేసి రవాణా నోడల్ అధికారి సిద్ధం చేసుకోవాలని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో డీఆర్‌సీ సెంటర్, కలెక్టర్ కార్యాలయంలో పోలీస్ శాఖ తగిన బందోబస్తు సెక్యూరిటీ ప్లాన్ రూపొందించుకోవాలని అదనపు ఎస్పీకి సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు (ఎంసీసీ) రిపోర్టులు ప్రతీ రోజు పంపించాలని తెలిపారు. ఓటర్లకు జడ్పీ సీఈవో, మునిసిపల్ కమిషనర్లు ఐడీ కార్డులు జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని జిల్లాల ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం తప్పదు

- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్

పాలమూరు, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో బీసీలను విస్మరించిన పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా ఉన్న బీసీ జనాభా పట్ల చిన్నచూపు చూడటం సరికాదన్నారు. రాజ్యాధికారం కావాలంటే బీసీలు ఐక్యతతో ఉండాలన్నారు. సమావేశంలో చికెనె మహేందర్, సారంగి లక్ష్మీకాంత్, సవారి సత్యం, బి.శేఖర్, అంజనేయులు, తిరుపతయ్య పాల్గొన్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం



బిడ్డను కుటుంబ సభ్యుల చేతికి అందిస్తున్న 108 సిబ్బంది

గండీడ్, మార్చి 21 : ఓ మహిళకు పురిటి నొప్పులు రావ డంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం 108 వాహన సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మండల పరిధిలోని చిన్నవార్వల్ గ్రామంలో ఓ మహిళ పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమా చారం ఇచ్చారు. చిన్నవార్వల్ నుంచి వాహనంలో గర్భిణిని తీసుకెళ్తుండగా గాదిర్యాల్ దగ్గర వెళ్తుతుండగా 108 వాహ నంలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నా రు వారని గండీడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. 108 వాహన సిబ్బంది ఈఎంటీ తాజుద్దీన్, పైలెట్ అక్బర్‌లకు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

మహమ్మదాబాద్, మార్చి 21 : గర్భిణులు ప్రతీరోజు గుడ్లు, పాలు పప్పుతో కూడిన ఆకుకూరలు తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని మహమ్మదాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ మల్లమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్-2లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులకు పిల్లలకు, బాలింతలకు ఉచితంగా ప్రతీరోజు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి బోధనతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ ప్రియాంక, అరుణ, లలిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, రాధిక, వేణుగౌడ్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఆత్మగౌరవం కాపాడాలి

- అలాంటివారినే ఎమ్మెల్సీ ఎన్నికలో గెలిపిస్తాం
- ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ్

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 21 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ఆత్మగౌరవాన్ని కాపాడే వ్యక్తులనే గెలిపిస్తామని తెలంగాణ ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకిళ్ల రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయాల మేరకు గ్రామాల అభివృద్ధికి, గ్రామీణ ప్రజల సంక్షేమానికి 73, 74 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకువచ్చారని అన్నారు. 243జి 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాలను చట్టబద్ధంగా ఇవ్వాల్సిన విధులు, నిధులు, గ్రామాలకు ఇవ్వలేని కారణంగా అభివృద్ధి జరగలేదని ఆయన అన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వారికే తమ సంఘం ఆహ్వానిస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీలో, మండల కేంద్రంలో సముచినత స్థానం కల్పించి ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని, ఎంపీటీసీలకు ఇప్పుడున్న వేతనంతో పాటు అదనంగా 50 శాతం పెంచాలని, అభివృద్ధి నిధులు ప్రతీ ఎంపీటీసీకి ఏటా రూ.20 లక్షల చొప్పున బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, మండల ప్రాథమిక పాఠశాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే అవకాశం ఇవ్వాలని, మండల పరిషత్ నిధులచే జరిగే పనులకు మండల పరిషత్ ద్వారా తీర్మానం ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ షాపులపై పర్యవేక్షణ కమిటీలు చేసి ఎంపీటీసీలను దానికి చైర్మన్‌లుగా నియమించాలని, గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసే వర్క్స్ కమిటీలో ఎంపీటీసీని సభ్యునిగా నియమించాలని కోరారు.